
ప్రారంభోత్సవానికి ముస్తాబైన రైల్వేస్టేషన్





రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్



ఆధునీకరించిన ట్రాక్

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధానమంత్రి మోదీ

కరీంనగర్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వేస్టేషన్ నూతన శోభ సంతరించుకుంది. అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించింది. రూ. 33 కోట్లతో నూతన సొబగులు పులుముకున్న ఈ స్టేషన్‌ను గురువారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు రైల్వే ఉన్నతాదికారులతో పాటు జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ప్రారంభోత్సవానికి రైల్వే శాఖ అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. స్వాగత తోరణాలు, విద్యుదీకరణ, ఫ్లెక్సీల ఏర్పాటుతో స్టేషన్ నూతన శోభను సంతరించుకుంది.



ముస్తాబైన ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

శ్రీరామ దూతం శిరసా నమామి

- నేడు పెద్ద హనుమాన్ జయంతి

కరీంనగర్ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వైశాఖ బహుళ దశమి పూర్వాభాద్ర నక్షత్రంలో జన్మించిన ఆంజనేయుడు శ్రీరాముడి భక్తుడు. మహాధీశాలి... వీరుడు... సప్త చిరంజీవుల్లో ఒకడు. శివపురాణం-రుద్రసంహితలో చెప్పినట్లుగా శివాంశ సంభూతుడైన ఆంజనేయుడు విష్ణు స్వరూపుడైన శ్రీరాముడి కొలుస్తూ రామనామ మాధుర్యాన్ని గోలుతూ వ్యాకరణ, నీతి, తత్వ, వాస్తు శాస్త్ర కోవిదుడిగా, బుద్ధి పరాక్రమాలను చూపే వ్యక్తిగా రామాయణంలో దర్శనమిస్తాడు. నిత్యం హనుమను పూజిస్తే లక్ష్మి స్థిరంగా ఉంటుందని, శ్రీరామ భజనలు జరిగే ప్రాంతంలో హనుమ ఆనంద భాష్పాలతో అంజలి ఘటిస్తూ కొలువై ఉంటాడని, దక్షిణాభి ముఖుడైన ఆంజనేయుడి కొలిస్తే తక్షణ ఫలితం ఉంటుందని సుదర్శన సంహితలో ఉంది. భగవంతుడి కంటే భక్తుడు గొప్పవాడని మారుతి నిరూపించాడు. హనుమలేని రామాలయం ఉండదు. హనుమంతుడు సీతాన్వేషణలో రాముడికి సహాయం చేశాడు. సంజీవని తెచ్చి లక్ష్మణుడిని బతికించాడు. హనుమను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పరాశర సంహిత చెప్పింది. గురువారం పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. దీక్షా విరమణలు, ఇరుముడులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలకు సిద్ధం చేశారు. ఎక్కడ చూసినా సింధూరవర్ణ వస్త్రధారణలు కలిగిన దీక్షా పరులు కన్పిస్తున్నారు. నగరంలోని దాదాపు నలభై ఐదుకు పైగా గల హనుమదాలయాలన్నీ దీక్షాపరులు, భక్తుల రామ, హనుమ నామస్మరణలు, భజనలతో మార్మోగనున్నాయి.

ఉగ్రవాద నిర్మూలనే మోదీ సర్కార్ లక్ష్యం

- పహల్గాం ఘటనతో తర్వాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చింది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీని ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తదితరులు

కరీంనగర్ స్పోర్ట్స్ మే 21 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఉగ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పహల్గాం ఘటన తర్వాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతో పాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదన్నారు. టెర్రరిజాన్ని అణచివేసే శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచమంతా గుర్తించిందన్నారు. పాకిస్తాన్ టెర్రరిస్టులకు అడ్డాగా మారిందని, టెర్రరిస్టులను ప్రోత్సహిస్తూ ఆ దేశం ఆర్థిక సాయం చేస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి ఆ దేశంలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందన్నారు. ముంబై పేలుళ్లు, లుంబినీ పార్క్, గోకుల్ చాట్ పేలుళ్లు, మక్కా మసీదు పేలుళ్ల తర్వాత దేశ ప్రజల్లో మార్పు వచ్చిందని, అవసరమైతే దేశం పక్షాన టెర్రరిజంపై యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉండడం సంతోషకమన్నారు. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాల్లో సామాన్య ప్రజలను, వారి ఆవాసాలను టార్గెట్ చేసి ధ్వంసం చేయాలనుకుందని, టెక్నాలజీని ఉపయోగించుకుని వాటిని తిప్పికొట్టిన ఘనత మన సైన్యానిదన్నారు. మోదీ నాయకత్వంలో అమిత్‌షా సారథ్యంలో టెర్రరిజం ఏ రూపంలో ఉన్నా అంతం చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మట్టుపెట్టాల్సిందేనని, ఇందులో మరో ఆలోచనే లేదన్నారు. యాంటీ టెర్రరిజం డే సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ వి ఆగంరావు, కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు పి మనోహర్‌రావు, కె రవీందర్‌గౌడ్, బండి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు హిందూ ఏక్తా యాత్ర

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- కాషాయమయమైన నగరం
- 50 వేల మందితో ర్యాలీకి ఏర్పాట్లు
- ఏక్తా యాత్రకు పన్నెండేళ్లు



వివిధ రూపాల్లో ఆకట్టుకోనున్న దేవతామూర్తుల ప్రతిమలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఏక్తా యాత్ర గురువారం కరీంనగర్‌లో జరగనున్నది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పన్నెండే ళ్లుగా ఏక్తా యాత్రను నిర్వహిస్తూ వస్తున్నా రు. ఆ ఆనవాయితీలో భాగంగానే గురువారం భారీ ఎత్తున నగరంలో ఏక్తా యాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి 50 వేల మంది హాజరవుతారని భావి స్తున్నారు. ఏక్తా యాత్ర కోసం నగరాన్ని కాషాయ జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లతో అలంకరించారు. యాత్ర సాయ త్రం 4 గంటలకు వైశ్య భవన్ వద్ద ప్రారంభమై టవర్‌సర్కిల్, కమాన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, బస్టాండ్, అమర వీరుల స్థూపం మీదుగా తిరిగి వైశ్యభవన్‌కు చేరుకోనున్నది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కళా రూపాల ప్రదర్శ నలు నిర్వహించనున్నారు. రాజకీయాలకు అతీతంగా హిందువులను సంఘటితపరిచే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతుందని, హిందు సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా, సంఘటిత శక్తిని చాటేలా ఏక్తా యాత్రను నిర్వహిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ యాత్రకు సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వేలాది మంది హనుమాన్ భక్తులతోపాటు పలు సంఘాల సభ్యులు ఈ యాత్రలో పాల్గొననున్నారు. ఆయా సంఘాలు ఇప్పటికే యాత్రకు సంఘీభావాన్ని ప్రకటించి యాత్రను విజయవంతం చేయాలని ప్రజలను కోరాయి. గత సంవత్సరం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఏక్తా యాత్రను నిర్వహించలేదు. ఆ ఎన్నికల్లో బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ సభ్యుడిగా గెలవడం, కేంద్ర మంత్రి పదవి చేపట్టంతో తన పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఈ యాత్రలో పాల్గొనేందుకు వీలుగా సంజయ్ కుమార్ ఏర్పాట్లు చేశారు. యాత్ర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సిబ్బందిని తరలించి నగరంలోని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్స్ ఏర్పాటు చేసి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీపీ గౌస్ ఆలం పర్యవేక్షణలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోని అన్ని వైన్‌షాపులను, బార్ షాపులను మూసే యాలని ఆదేశాలు జారీ చేశారు. ఎండతీవ్రత కారణంగా ర్యాలీ జరిగే వీధుల్లో ర్యాలీలో పాల్గొనే వారికి మంచినీరు, మజ్జిగ అందించేందుకు వివిధ సంఘాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ప్రాథమిక విద్య పునాదిరాయి లాంటిది



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల, ఉద్యోగుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రాథమిక విద్య పునాదిరాయి లాంటిదని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం సెయింట్‌జార్జ్ పాఠశాలలో జరుగుతున్న కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గన్నేరు వరం, వీణవంక మండలాల ప్రభుత్వ ఉపాధ్యా యుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారు ్థలను అద్భుతంగా తీర్చిదిద్దడంలో ప్రాథమిక ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యలో విజయం సాధించడంలో ప్రాథ మిక విద్య పునాది లాంటిదన్నారు. అనుకున్న లక్ష్యాలు చేరుకో వడానికి ఆశించిన అభ్యసనా ఫలితాలు సాధించడానికి ఉపాధ్యా య బృందం ఎల్లప్పుడూ అప్‌డేట్ అవుతుండాలని, ఇందులో భాగంగా ఈ వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. వీటిని చక్కగా వినియోగించుకుని విద్యార్థులను ఆణిముత్యాలుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి జిల్లా యంత్రాంగం సదా సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెయింట్‌జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ పి ఫాతిమారెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ కె అశోక్ రెడ్డి, ఎంఈవోలు కె రవీందర్, టి ఆనందం, కె రామయ్య, శోభారాణి, రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్షలు పడేసేలా చర్యలు తీసుకోవాలి..

- భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి) : నిందితులకు శిక్షలు పడేలా, బాధితులకు నష్టపరిహారం అందేలా భరోసా కేంద్రంలోని అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో భరోసా కేంద్రాన్ని బుధవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తనిఖీ చేశారు. తెలంగాణ పోలీసుశాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో గత డిసెంబరులో ప్రారంభమైన ఈ కేంద్రం పనితీరును, బాధితులకు అందిస్తున్న సేవలను సీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలోని సిబ్బందితో సీపీ మాట్లాడి రికార్డులను పరిశీలించి వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు భరోసా కేంద్రంలో అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసుల వివరాలను పరిశీలించిన సీపీ అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు, అసభ్యకరమైన లైంగిక ప్రవర్తనకులోనైన పిల్లలకు పోలీసు ఠాణాలు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూతనందించేందుకు ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. బాధితులకు సేవలందించడంలో భరోసా కేంద్రాలు మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐ శ్రీలత, ఎస్ఐ అనూష పాల్గొన్నారు.

జూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో జూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం జిల్లా మేనేజర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద, అనాథ, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. జూన్ 1 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు మహిళలు ఈ కోర్సుకు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ జతపరచాలన్నారు. మరిన్ని వివరాలకు 9347114396, 9550841914 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ లీక్



మిషన్ భగీరథ వాల్వ్ లీక్ కావడంతో వృథాగా పోతున్న నీరు

గంగాధర, మే 21 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ లీక్‌తో రక్షిత నీరు వృథాగా పోతుంది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ దారి పక్కన మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పైపులై న్ ద్వారా పెగడపల్లి, గంగాధర మండలంలోని పలు గ్రామాలకు రక్షిత నీరు సరఫరా చేస్తారు. బుధవారం ఉదయం ఎయిర్ వాల్వ్ లీకయి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోయింది. ఎవ్వరూ పట్టించుకోలేదు. గతంలో ఇదే ప్రాంతంలో పైపు పగిలి పదిహేను రోజులు నీరు లీకైంది. సిబ్బంది మరమ్మత్తులు చేసిన రోజులకే మళ్లీ లీక్ అవడం ప్రారంభమైంది. వేసవి కాలం తాగునీరు ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి లీకేజీలను సవరించి నీటి సరఫరాలో అంతరాయాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను మూడు పద్ధతుల్లో వేరు చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను మూడు పద్ధతుల్లో వేరు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం నగరంలోని 12వ డివిజన్ భగత్‌నగర్‌లో పర్యటించారు. పలు కాలనీల్లో పాదయాత్రగా పారిశుధ్య పనులను తనిఖీ చేసి పరిశీలించారు. శివాలయం వద్ద పలు అపార్ట్‌మెంట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో ఉత్పత్తి అవుతున్న చెత్తను వందశాతం సెగ్రిగేషన్ చేయాలన్నారు. మూడు డబ్బాల్లో తడి చెత్తను, పొడి చెత్తను, ఇతర చెత్తను ఇలా మూడు రకాలుగా వేరు చేయాలని అన్నారు. తడి చెత్తను అపార్ట్‌మెంట్ ఆవరణలోనే హోం కంపోస్టు చేయాలన్నారు. పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు, తదితర వస్తువులను పారిశుధ్య కార్మికులకు అందిస్తే డీఆర్‌సీసీ సెంటర్లకు రీసైక్లింగ్ కోసం తరలిస్తారని తెలిపారు. చెత్తను వేరుచేయడం ద్వారా డంపుయార్డుకు వెళ్లే చెత్త శాతం తగ్గుతుందన్నారు. హోం కంపోస్టు ఎరువులను ఇంట్లో మొక్కలకు వాడుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, అపార్ట్‌మెంట్ ప్రజలు పాల్గొన్నారు.

దారులన్నీ కొండగట్టుకే..



- తరలివస్తున్న దీక్షాపరులు, భక్తులు
- రెండో రోజు వైభవంగా ఉత్సవాలు
- నేడు హనుమాన్ పెద్ద జయంతి

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దీక్షా పరుల సంకీర్తనలతో, భక్తుల జై హనుమాన్ ఘోషతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం పులకిస్తోంది. రామనామ సంకీర్తనలతో అంజన్న పరిసరాలు భక్తి పారవశ్యంతో నిండిపోతున్నాయి. రామదండును తల పించేలా భక్తులు కొండగట్టుకు వస్తుండగా ఆలయం కాషాయ వర్ణంతో కళకళలాడుతోంది. మంగళవారం నుంచి ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలతో బుధవారం రాత్రి కొండంతా భక్తజన శోభితంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా దీక్షాపరులు కాలి నడకన, వాహనాల్లో కొండపైకి చేరుకుని మాల విరమణ చేస్తున్నారు.

వైభవంగా జయంతి ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం యాగశాలలో వేద పండితులు, అర్చ కులు స్థాపిత దేవతారాధన, హోమం, సుందరకాండ పారాయణం, పంచామృత అభిషేకం, సహస్ర నామా ర్చన, విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ అమ్మవారి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు తిరుక్కోవెల కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు, ఉప ప్రధాన ర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ ఆలయ పర్య వేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. సాయం కాలం ఆలయ ఆవరణలో కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తలదాచు కోవడానికి పాట్లు పడ్డారు. మాల విరమణ, దర్శనం కోసం బారులు తీరారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా వేలాది దీక్షాపరులు మాల విరమణ చేసేందుకు కొండగట్టుకు తరలివస్తున్నారు. మంగళవారం నుంచి ఆలయం ముందు గల యాగశాలలో త్రైయాహ్నిక ఉత్సవాల యాగంను మహా వైభవంగా నిర్వహిస్తుండగా గురువారం వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి నిర్వహించనున్నారు.



యాగం నిర్వహిస్తున్న అర్చకులు





కొండగట్టులో మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు, ఆలయ ఆవరణలో దీక్షాపరుల సందడి

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం



దరఖాస్తు చేసుకునే విధానం

మీసేవా కేంద్రాల ద్వారా టీఎస్ ఈ పాస్ పోర్టల్లో telanganaepass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి తన పూర్తి వివరాలు, పదో తరగతి మార్కుల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, నాలుగు నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టి ఫికెట్లు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువపత్రాలను సమర్పించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షలకు మించరాదు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం 36 వేల రూపాయల ప్రోత్సాహకం అందించనుంది..

గణేశ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్యచాలా కీలకమైనది. చాలామందికి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్య అభ్యసించాలనే కోరిక ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ విద్య పేదలకు అందని ద్రాక్షగా మారింది. ప్రతిభ ఉన్న పేద విద్యార్థుల కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్పొరేట్ విద్యా పథకాన్ని తీసుకొచ్చింది. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈ పథకం ద్వారా తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ఈ పథకానికి సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తుల స్వీక రణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభు త్వం ప్రోత్సాహకం అందించనుంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నాలుగు వందలకుపైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత, ఎయిడెడ్, కస్తూర్బా, నవోదయ, గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎంపికైన విద్యార్థు లకు కళాశాలతో కూడిన సమాచారం అందిస్తారు.

పేద విద్యార్థులకు ఉపయోగకరం

పి పవన్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి



కార్పొరేట్ విద్యా పథకం ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలి. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన విద్యార్థులకు రెండేళ్లపాటు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య, వసతి కల్పిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హుజూరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్‌బ్యాంక్ ఉద్యోగి ద్విచక్రవాహనంపై అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఓ టిప్పర్‌లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చౌరస్తా వద్ద ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

గుడి చెరువులో రెండు మృతదేహాలు లభ్యం

వేములవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్లజిల్లా వేములవాడ గుడిచెరువులో బుధవారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఇద్దరు మగవారి మృతదేహాలను గుడి చెరువులోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గుడి చెరువులో రెండు మృతదేహాలను గుర్తించి వెలికితీశామని ఆయన తెలిపారు. మృతుల్లో ఒకరు 55-60 సంవత్సరాలు, మరొకరు 35-40 సంవత్సరాల వయసు ఉన్నట్లు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాల వద్ద వారి చిరునామా, ఇతర వివరాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, రెండు మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు వేరు వేరు సమయాల్లో మృతిచెందినట్లు తెలుస్తోందని, మరణానికిగల కారణాలు ఇంకా వెలుగులోకి రాలేదన్నారు. ఆచూకీ తెలియని వ్యక్తులకు సంబంధించిన బంధువులు మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో పరిశీలించవచ్చని తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో..

మానకొండూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలోగల ఎస్సారెస్పీ ప్రధానకాలువలో బుధవారం కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సారెస్పి ప్రధాన కాలువలో లభ్యమైన మృతదేహం మూడు నుంచి నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని తెలిపారు. ఇతను బీహర్ లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వలస కూలీ అయి ఉండొచ్చన్నారు. వయస్సు 30 నుంచి 35గా ఉన్నట్లు తెలిపారు. గ్రామ కారోబార్ ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడు మృతి



బాలరాం (ఫైల్)

ముస్తాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌గ్రామానికి చెందిన పెద్దూరి బాలరాం (50) అనేగీత కార్మికుడు కల్లుగీసేందుకు వెళ్లి చెట్టుపై నుంచి జారిపడి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. గ్రామశివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మరణించాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గీతకార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీపీఏసీఎస్ చైర్మన్ బొందుగుల దేవిరెడి, మాజీ సర్పంచ్ యారటి లక్ష్మీ, గాంత రాజులు కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మానస (ఫైల్)

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం గ్రామంలో బుధవారం డిష్ తీగలు ఓ మహిళ ప్రాణాలు తీశాయి. బట్టలు ఆరవేస్తూ విద్యుదాఘాతంతో శీలం మానస(30)అనే మహిళ మృతిచెందింది. ఇంట్లో బట్టలు ఆరవేస్తుండగా పక్కనే డిష్ బాక్స్‌కుచెందిన తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో మానసను చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డిష్‌బాక్స్‌ను తొలగించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని డిష్ నిర్వాహకులపై మృతురాలి తల్లి అవారి మల్లీశ్వరి పోలీసులకు ఫిర్యాదుచేసింది. మానసకి భర్త, కొడుకు, కూతరు ఉన్నారు. భర్త సంతోష్ మంగళవారమే ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగ సంతోష్ మళ్లీ తిరిగివస్తుండడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో పేకాట ఆడుతున్న 13మందిని కొత్తపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రేకుర్తిలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి ఏఎస్సై పోచయ్య ఆధ్వర్యంలో దాడి చేశారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3లక్షల65వేల నగదు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారికి నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

'జెమ్'తో అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం

- బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి
- విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ



యోగా చేస్తున్న అమ్మాయిలు



కరాటేలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

జ్యోతినగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజిక వికాసానికి ఎన్టీపీసీ కృషి చేస్తున్నది. ప్రధానంగా ప్రభావిత ప్రాంతంలో విద్యాభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) పథకం కింద నిధులు కేటాయించి వివిధ పనులకు వినియోగిస్తోంది. దీనిలో భాగంగానే ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు బాలికాసాధికారతకు ఎన్టీపీసీ చేయూతనందిస్తోంది. గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్(జెమ్) పేరిట చుట్టుపక్కల సర్కారు బడుల్లో 8వ తరగతి చదువుతున్న 120 మంది బాలికలకు నెలరోజులపాటు ప్రత్యేక వర్క్‌షాప్(శిక్షణ) నిర్వహిస్తోంది. ఏడవ తరగతి పూర్తయి 8వ తరగతికి వచ్చిన 120 మంది విద్యార్థులను ఎన్టీపీసీ ఎంపిక చేసింది. ఈ నెల 6న ప్రారంభమైన జెమ్ వర్క్‌షాప్‌లో వీరికి వివిధ సబ్జెక్టులతో పాటు ఇతర రంగాలలో తర్ఫీదునిస్తున్నారు. భువనేశ్వర్‌కు చెందిన తన్వీ కన్సల్టెన్సీ సంస్థ సహకారంతో 28 రోజుల పాటు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణనిస్తున్నారు. 2019 నుంచి ప్రతిఏటా జెమ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు.

చదువుతోపాటు స్వీయ రక్షణలో శిక్షణ

జెమ్‌లో భాగంగా బాలికలకు చదువుతో పాటు స్వీయరక్షణ, ఇతరఅంశాలలో శిక్షణనిస్తున్నారు. తెలుగు,హిందీ,ఇంగ్లీషు, మ్యాథమెటిక్స్ సైన్స్ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో బోధిస్తున్నారు. అలాగే సెల్ఫ్ డిఫెన్స్‌లో భాగంగా కరాటే నేర్పిస్తున్నారు. యోగా, చిత్రలేఖనం, హస్తకళల్లో ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. సాంస్కృతిక అంశాలలో భాగంగా నృత్యం నేర్పిస్తున్నారు. కంప్యూటర్స్‌లో ప్రాథమిక అంశాలను(బేసిక్స్) విద్యార్థినులకు నేర్పిస్తున్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించడం జంకులేకుండా ఉపన్యాసం ఇచ్చేలా తర్ఫీదునిస్తున్నారు. తాము జీవితంలో ఏమి కావాలనుకుంటున్నారో నిర్ణయించుకునేలా మోటివేషన్ క్లాసులు ఇప్పిస్తున్నారు.

ఉదయంనుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షణ పొందుతున్న బాలికలకు వసతితోపాటు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. ఎన్టీపీసీలో ఇండస్ట్రియల్ క్యాంటీన్ నిర్వహిస్తున్న ఐసీహెచ్(ఇండియన్ కాఫీ హౌజ్) సంస్థ విద్యార్థినిలకు రుచికరమైన భోజనం, అల్పాహారం అందిస్తోంది.

శిక్షణ ఎంతో ఉపకరిస్తోంది..

- జి.గాయత్రి, మొఘల్‌పహాడ్



జెమ్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. చదువు సంబంధ సబ్జెక్టులతోపాటు మాకు ఇతర అంశాలను నేర్పిస్తున్నారు. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. జెమ్‌లోనృత్యంలో నాకు సోలో, గ్రూప్ డ్యాన్స్ నేర్పిస్తున్నారు.

మ్యాథ్స్‌లో శిక్షణ ఇస్తున్నారు..

- స్వాతి, దుర్గయ్యపల్లి జెడ్పీస్కూల్



నాకు లెక్కల సబ్జెక్టు అంటే ఎంతో ఇష్టం. మ్యాథ్స్‌లో ప్రత్యేకశిక్షణ ఇస్తున్నారు. గతంలో కన్నా ఇప్పుడు లెక్కలు సులువుగా అర్థమవుతున్నాయి, చేస్తున్నాను. మిగతా అంశాలు యోగా, డ్రాయింగ్‌లో శిక్షణతో వాటిపై ఆసక్తి పెరిగింది.

జెమ్ భవిష్యత్‌కు దిక్సూచి

- ఎం.వామిక, గాంధిపార్క్ జెడ్పీ స్కూల్



జెమ్ శిక్షణ నా భవిష్యత్‌కు దిక్సూచి లాంటింది. నాకు ఇంగ్లీషు సబ్జెక్టు అంటే ఇష్టం. కానీ మాస్కూల్లో అంతబాగా నేర్చుకోలేకపోయాను. జెమ్‌లో టీచరు ప్రత్యేకంగా ఇంగ్లీషు బోధిస్తున్నారు. సులువుగా అర్థమయ్యేలా చెబుతున్నారు.

సాధికారత, డ్రాపౌట్లు తగ్గించేందుకు

- విజయ్ కుమార్ సిక్దర్, హెచ్‌వోడీ(హెచ్ఆర్)



ప్రభావిత ప్రాంతంలోని బాలికల సాధికారత, అమ్మాయిల డ్రాపౌట్లు తగ్గించడంలో జెమ్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో జరిగిన నాలుగు జెమ్ వర్క్‌షాప్‌లలో శిక్షణ పొందిన విద్యార్థినుల్లో మెజారిటీ విద్యార్థినులు మంచి కెరీర్‌ను ఎన్నుకొని ముందుకు నడుస్తున్నారు. సామాజిక బాధ్యతగా జెమ్ నిర్వహిస్తు న్నాం. భవిష్యత్‌లో బాలికల అభ్యున్నతి కోసం జెమ్‌తోపాటు సీఎస్ఆర్ పథకం కింద ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తాం.

వృత్తి నైపుణ్య శిక్షణ

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగునూర్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో చదివి, ఉద్యోగం రాని వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రానివారు ఉంటే వారికి ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధిపొందేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వచొరవతో ఉన్నతిఫౌండేషన్ ముందుకొచ్చి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. 19నుంచి 25ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గురుకుల పూర్వవిద్యార్థులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గౌలిదొడ్డి కళాశాలలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి కోరారు.

కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల తనిఖీ



వివరాలను తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని కొనుగోలు కేంద్రంతోపాటు పలుగ్రామాల్లోని రైస్‌మిల్లులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధులు లక్ష్మారెడ్డి, జంగయ్య బుధవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రైతుల వివరాలను, ధాన్యం నాణ్యతలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యంకొనుగోలు చేయాలని సూచించారు. రైస్‌మిల్లులలోని దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలకు సంబంధించిన రికార్డులు, పత్రాలను పరిశీలించారు. ధాన్యంకొనుగోలు, రైస్‌మిల్లుల్లోని ధాన్యం నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీటీసీఎస్ అశోక్, ఇన్‌చార్జి డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం మల్లేశం తదితరులు ఉన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని పట్టుకున్నామని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. బండలింగంపల్లి గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ అల్లెపు వంశీకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. మండలంలోని పదిర గ్రామ శివారు మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రాజన్నపేటలోని వాహన డ్రైవర్ శివరాత్రి నర్సయ్య సూచన మేరకు పికప్ వాహనంలో ఇసుకను తరలిస్తు పట్టుబడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి డ్రైవర్ వంశీకృష్ణను అరెస్ట్ చేశామని వెల్లడించారు. యజమాని నర్సయ్య పరారీలో ఉన్నాడని వివరించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడి మృతి

కోల్‌సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే సింగరేణి కార్మికుడు మంకిడి సాంబమూర్తి(53) ఈనెల4న ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సాంబమూర్తి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించగా మనస్తాపానికి గురై 4వతేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. సింగరేణి ఆసుపత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. అతనికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

పంటల వైద్యుడు 'ప్లాంటిక్స్' యాప్

- రైతుల కోసం రూపొందించిన ఇక్రిశాట్



చొప్పదండి, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులకు సాగులో సహాయం చేస్తుంది 'ప్లాంటిక్స్' యాప్. పలు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్ ద్వారా రైతుల 35 రకాల పంటల సమాచారం అందుతుంది. రైతుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కమ్యూనిటీ ఫీచర్ అందుబాటులో ఉంది. జర్మనీకి చెందిన సంస్థ ఇక్రిశాట్ భాగస్వామ్యంతో ఈ ప్లాంటెక్స్ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారంగా రైతులకు ఈ మొబైల్ యాప్ సలహాలు, సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతుంది.

పంటల సాగులో సలహాలు, సూచనలు

రైతులు పంటల కోసం రూపొందించిన యాప్ వైద్యుడిగా పేరొందింది. పంటల్లో చీడపీడలు, తెగుళ్ల, వ్యాధులను గుర్తించి వెంటనే రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుంది. పరిష్కార మార్గాలను తెలుపుతూ, వ్యాధుల నివారణకు మందులను ప్రతిపాదిస్తుంది. రైతులకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో నెలకొన్న వాతావరణ సమస్యలు, భూసారంలో లోపాలను యాప్ ఏఐ సహకారంతో గుర్తిస్తుంది. మొక్కలకు అందించాల్సిన పోష విలువలను, ఎరువుల వాడకాన్ని సూచిస్తుంది. అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తల సలహాలను కూడా పొందవచ్చు.

పంట ఫొటోలు అప్‌లోడ్ చేయాలి...

రైతులు తమ పంటలో తెగుళ్ల, పోషక లోపాలు, వ్యాధులకు సంబంధించిన ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. వెంటనే పురుగులను, సమస్యను గుర్తించి పరిష్కార మార్గాన్ని చూపుతుంది. 30 ప్రధాన పంటలకు సంబంధించిన 780 రకాల వ్యాధులు, తెగుళ్లను యాప్ గుర్తించి సలహాలు, సూచనలు ఇస్తుంది. ఈ యాప్ 19 ప్రాంతీయ భాషల్లో సమాధానాలు ఇస్తుంది. యాప్ ద్వారా 500 మంది వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పొందవచ్చు.

రైతులకు తమ ప్రాంతాల్లో పంటలకు రాబోయే వ్యాధులు తెలుపుతూ హెచ్చరికలను కూడా ఈ యాప్ అందిస్తుంది. వాతావరణ సూచనలు, ఎరువుల వాడకాన్ని తెలియజేస్తుంది. భూమిలో పోషకాల లోపాలను గుర్తిస్తుంది. తద్వారా పంట నష్టాన్ని తగ్గించి, అధిక దిగుబడిని పొందవచ్చు. దీంతోపాటు రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడానికి డిజిటల్ ప్లాట్‌ఫాంగా పనిచేస్తుంది. ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఉన్న ధరలను తెలుసుకోవచ్చు. ప్లే స్టోర్ నుంచి ప్లాంటిక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.





పుష్కరస్నానం ఆచరిస్తున్న ప్రజలు

త్రిలింగ క్షేత్రం.. పుష్కర శోభితం

- ఏడోరోజు లక్ష మందికిపైగా పుణ్యస్నానాలు
- అకాలవర్షంతో భక్తులకు ఇబ్బందులు

కాళేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రం.. కాళేశ్వరం పుష్కర శోభితమై వెలుగులీనుతోంది. వేలాదిగా తరలొస్తున్న భక్తజనంతో త్రివేణి సంగమం సందడిగా మారింది. సరస్వతి పుష్కరాల్లో ఏడో రోజైన బుధవారం లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది వాహనాల్లో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో సరస్వతీ మాతకు చీర, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సంఖ్య రద్దీగా ఉండడంతో అధికార యంత్రంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్‌కు వెళ్లేందుకు అధిక సంఖ్యలో ఉచిత బస్‌లను అందుబాటులో ఉంచారు. అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి అన్నారం క్రాస్ రోడ్డు నుంచి పుష్కర ఘాట్, తాత్కాలిక బస్టాండు వరకు ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించారు. అకాల వర్షంతో రోడ్లన్నీ బురదమయమై భక్తులు ఇబ్బందు లు ఎదుర్కొన్నారు.

● పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతి పుష్కరాల్లో బుధవారం బెల్లంపల్లి శాసనసభ్యుడు, మాజీ మంత్రి గడ్డం వినోద్ కుమార్, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు, ఎస్పీ కిరణ్‌ఖరే అంతర్వాహినిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.





గోదావరి వద్ద పూజలు



గోదావరికి ఎడ్ల బండ్లలో వస్తున్న భక్తులు



24న ఉమ్మడి జిల్లా అండర్-11 చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-11 బాల బాలికల చదరంగ పోటీలను ఈ నెల 24వ తేదీన కరీంనగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీలో ఈ పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తామని పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2015 తర్వాత జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలలోపు 9390177607 నంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో 19 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీ క్షల్లో బుధవారం మాల్ ప్రాక్టీస్ చేసిన 19 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, హుజూరాబాద్‌లో శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, మహదేవపూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో 16 మందిని డీబార్ చేసినట్లు వివరించారు.

మామిడి లారీ బోల్తా

జగిత్యాల అగ్రికల్చర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున మామిడి లారీ బోల్తా పడింది. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా ఖమ్మం నుంచి ఢిల్లీ వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన మామిడి లారీ బోల్తా పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికుడు సుమేరుద్దీన్ ఆజాద్ 108 వాహనంతో పాటు పట్టణ పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ డ్రైవర్, క్లీనర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అనాథ యువతి పెళ్లి పెద్దగా కలెక్టర్

- అంగరంగ వైభవంగా మానస వివాహం
- హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే తల్లితండ్రులను కోల్పోయిన మానసతో పాటు తన చెల్లెలు లక్ష్మి పదహారేళ్ల క్రితం ఒక బాలల సంరక్షణ కేంద్రానికి చేరారు. ఆశ్రమ నిర్వాహకులు వారిని పెంచి పెద్ద చేశారు. ఉన్నత చదువులు చదివిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన నక్క మానసకు పెళ్లి కుదిరింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష పెళ్లి పెద్దగా నిలిచి మానసకు అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో గల తబిత బాలల సంరక్షణ ఆశ్రమంలో నక్క మానస, ఆమె చెల్లెలు నక్క లక్ష్మి పదహారేళ్లుగా ఆశ్రయం పొందుతున్నారు. వీరి తల్లితండ్రులు చిన్నపుడే మరణించడంతో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీస్ (ఐసీపీఎస్) అధికారులు వీరిని ఆశ్రమంలో అప్పగించారు. అప్పటి నుంచి తబిత ఆశ్రమం నిర్వాహకులు వీరేందర్ నాయక్, విమల దంపతులు వారికి తల్లితండ్రులు లేని లోటు తీర్చి తమ సొంత పిల్లలుగానే పెంచి పోషించారు.



టీఎన్జీవో నాయకులు అందజేసిన చెక్కును మానస దంపతులకు ఇస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

మానస కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యింది. మానస పెళ్లీడుకు రావడంతో పెళ్లి సంబంధాలు చూడడం ఆరంభించారు. జనగాం జిల్లా రఘునాథపల్లికి చెందిన మాస రేణుక, యాకయ్యల కుమారుడు మాస రాజేష్ ఎలాంటి కట్నకానుకలు లేకుండానే మానసను పెళ్లి చేసుకునేందుకు ముందుకు వచ్చాడు. మానస పెళ్లి ఘనంగా జరిపించాలనే ఉద్దేశంతో ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ శాఖాధికారి పి వేణుగోపాల్‌రావుకు ఆశ్రమ నిర్వాహకులు తెలియజేశారు. ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకవెళ్లారు. స్పందించిన కలెక్టర్ సొంత ఖర్చులతో పెళ్లి జరిపించేందుకు ముందుకు వచ్చి ముహూర్తం ఖరారు చేశారు. పెళ్లికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.

బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 11:05 గంటలకు పండితులు వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా మానస, రాజేష్‌ల వివాహం జరిపించారు. అంతకు ఒక రోజు ముందు రామగుండం తబిత ఆశ్రమంలో పెళ్లి కూతురును చేయడం, హల్ది, హిందూ సంప్రదాయం ప్రకారం ఆశ్రమం నిర్వాహకులు అన్ని వేడుకలు జరిపించారు. ఈ వివాహానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా సంక్షేమ శాఖాధికారి పి వేణుగోపాల్ రావు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఆశ్రమ నిర్వాహకులు కన్యాదానం చేశారు. ఈ పెళ్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అదనపు కలెక్టర్లు డి వేణు, జె అరుణశ్రీ, టీజీఓ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ తమ సంఘం తరఫున 61,800 రూపాయల చెక్కును అందజేశారు. ప్రతి వివాహ వేడుక కు హాజరై వధూవరులను ఆశీర్వదించి కట్నాలు తీసుకునే ట్రాన్స్‌జెండర్లు ఈ వధూవరులకు బట్టలు పెట్టి 11 వేల కట్నం చదివించి ఆశీర్వదించారు. సాయంత్రం భరాత్ నిర్వహించి నవ వధూవరులను సాగనంపారు. తన తోబుట్టువు తనను వదిలి అత్తారింటికి వెళ్లడంతో లక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఈ వివాహం వేడుకలను జరిపించడంలో తబిత ఆశ్రమ నిర్వాహకులతో పాటు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది చాలా శ్రమించారు.

ఎన్టీపీసీ ప్లాంటులో ప్రమాదం..

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

జ్యోతినగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో కొమురయ్య, అంకూస్ అనే ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్టేజ్ 2 పరిధిలోని ప్రజర్ పార్ట్స్ విభాగం హెచ్‌ఎఫ్‌వో వద్ద పనిచేస్తుండగా పైపు పగిలి వేడి ఆయిల్ కార్మికులపై పడడంతో ఈ ప్రమాదం జరిగింది. కాలిన గాయాలైన ఇద్దరిని ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కొమరయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. లక్ష్మీపురానికి చెందిన కొమరయ్య, అన్నపూర్ణ కాలనీకి చెందిన అంకూస్‌లు ఫ్యాబ్ ఎరక్టర్స్ అనే కాంట్రాక్టు సంస్థలో పని చేస్తున్నారు. ప్రమాదంపై ఎన్టీపీసీ యాజమాన్యం విచారణ చేపట్టినట్లు సమాచారం.

ప్రకృతి సంరక్షణతోనే జీవ వైవిధ్యం



- కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ
- సహజ వనరుల విధ్వంసంతో వినాశనం....
- నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం

కరీంనగర్ అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి మనిషిని రక్షించడం మానవత్వం. అదే జీవ వైవిధ్యాన్ని రక్షించి సంరక్షించడం దైవత్వం. జీవవైవిధ్యం ప్రకృతి ఇచ్చిన వరం. మానవుడి మనగడకు ఆధారం. దానిని కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యం. మానవుడు తన కార్యకలాపాలను ప్రకృతికి అనుకూలంగా మార్చుకుని జీవ వైవిధ్యం అం తరించకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. సహజ సిద్ధ వనరులను ఎడాపెడా వినియోగిస్తూ విధ్వంసం



చేస్తుండడం జీవుల మనుగడకే ప్రమాదకరంగా పరిణమించింది. పర్యావరణ సమతుల్యతను కాపాడితేనే మానవ మనుగడకు అవకాశం ఉంటుంది. మనుషుల ప్రస్తుత జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చి విరివిగా రసాయనాల వినియోగం, ప్లాస్టిక్ వాడకం, చెట్ల నరికివేత, గుట్టల ధ్వంసం, వన్యప్రాణుల వేట వంటివి తగ్గించుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుని కాలుష్య నియంత్రణకు పాటుపడాల్సిన అవసరం ఉంది.

వనాలు, వన్యప్రాణులు, సహజసిద్ధమైన గుట్టలు, నదులపై మానవ మనుగడ ఆధారపడింది. అడవుల ధ్వంసం వల్ల గ్లోబల్‌వార్మింగ్ పెరిగిపోతున్నది. మరోవైపు విచక్షణారహితంగా వన్యప్రాణుల వేటతో ప్రతి రోజు 72 జీవ జాతులు, గంటకు మూడు వన్యప్రాణులు అంతరించిపోతున్నట్లు పలు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రకృతి సహజసిద్ధమైన వనరులను అవసరానికి మించి వినియోగిస్తుంటడంతో పర్యావరణం కలుషితమై భూతాపం పెరగడం మూలంగా సున్నితమైన కొన్ని జీవజాతులు అంతరించిపోతున్నాయి. అడవులు రోజు రోజుకు తరిగి పోవడంతో వన్యప్రాణులు ఆవాసం కోల్పోయి, ఆహారం లేకుండా అంతరించేస్థాయికి చేరుకుంటున్నాయి. పులులు, సింహాలతో పాటు మరి కొన్ని అరుదైన ప్రాణులు అంతరించే స్థాయికి చేరుకున్నాయి. సహజ వనరులను మితంగా వినియోగించుకుని, పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ విచక్షణతో వ్యవహరించినప్పుడే జీవవైవిధ్యం సురక్షితంగా ఉంటుంది. అప్పుడే సమస్త జీవులు మనుగడను సాగిస్తాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూతాపం పెరిగి ప్రకృతిలో పెను మార్పులు సంభవిస్తాయి. దీంతో అతివృష్టి, అనావృష్టి ఏర్పడి తాగు, సాగునీటికి కటకట, పశుగ్రాసం లేక ఇబ్బందులు ఏర్పడుతాయి. భూమిలోని 84 లక్షల జీవరాశుల్లో ప్రస్తుతం 24 లక్షల జాతులు మాత్రమే జీవించి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

జీవవైవిధ్య రక్షణకు..

- జంతువుల, పక్షుల ఆవాసాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
- రోడ్లకిరువైపులా పండ్లు, కలపనిచ్చే చెట్లను విరివిగా పెంచాలి.
- అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం తాగునీటి తొట్లు, చెక్‌డ్యాంలు నిర్మించాలి.
- సామాజిక అడవులను ప్రోత్సహించాలి.
- రైతులు ప్రకృతి వ్యసాయాన్ని అనుసరించాలి. కృత్రిమ ఎరువులు, రసాయనిక పురుగుల మందులను ఉపయోగించకుండా అవగాహన కల్పించాలి.
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి.
- వన్యప్రాణులను పరిరక్షించాలి
- జీవవైవిధ్యం రక్షణపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

ప్రకృతి హితంగా భారతీయత...

భారతీయ సంస్కృతిలో ప్రతి చిన్న ఆచారం ప్రకృతిహితంగానే ఉంటుంది. వ్యవసాయంలో ఏ విధమైన హైబ్రిడ్, బీటీ విత్తనాలు ఉండేవి కావు. రైతులే సొంతంగా విత్తనాలను తయారు చేసుకునేవారు. పశువుల పేడను ఎరువుగా ఉపయో గించేవారు. రైతు పండించిన పంట ఇంటికి రాగానే కొంత పిచ్చుకల కోసం సింహద్వారానికి ప్రత్యేకంగా కట్టి ఆహారంగా అందించేవారు. రసాయనాలు వాడనందున పొలంలో రకరకాల మిత్ర జీవాలు ఉండేవి.

ఇది ప్రకృతి వ్యవసాయం. జీవవైవిధ్యాన్ని కాపాడే అచ్చమైన భారతీయ వ్యవసాయ పద్ధతి. ఈ విధానంలో పూసిన పుష్పాలు కూడా మూడు రోజుల వరకు వాడిపోవు. పరిస్థితులు మారాయి. అధిక శాతం రైతులు హైబ్రీడ్ విత్తనాలు, నసాయన పురుగు మందులు, ఎరువులు ఉపయోగిస్తున్నారు. భూమిని రసాయన ఎరువులతో నింపుతున్నారు. ఇప్పుడిప్పుడు కొంత మంది రైతులు భారతీయ వ్యవసాయ విధానంపై దృష్టి మరల్చి మళ్లీ జీవవైవిధ్యాన్ని రక్షించే ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు.

నేపథ్యం....

1992లో రియోలో అంతర్జాతీయ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పర్యావరణ సదస్సులో జీవ వైవిధ్య ధ్వంసంపై ఆందోళన వ్యక్తమైంది. జీవ వైవిధ్యాన్ని కాపాడాలని 150 దేశాలు తీర్మానిస్తూ సంతకాలు చేశాయి. ప్రతి సంవత్సరం మే 22న ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహించాలని తీర్మానించి అప్పటి నుంచి అమలు చేస్తున్నారు. 2010 సంవత్సరాన్ని జీవ వైవిధ్య సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2012లో హైదరాబాద్‌లో జీవవైవిధ్య సదస్సు నిర్వహించగా 193 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము, పామును తిని గద్ద జీవిస్తుంది. గద్ద మరణించాక దానిని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా జీవవైవిధ్య చక్రం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా చక్రంలోని మిగతా అన్ని ప్రాణులపై ప్రత్యక్షంగా తీవ్రప్రభావం ఉంటుంది. మిగతా ప్రాణులపై పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా విశ్వంలో అనేక వృత్తాలు ఉంటాయి. వాటిలో మనుషులు ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది. ఏ ఒక్క జీవి అంతరించినా అది మాన మనుగడకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10 వేల జాతుల జీవరాశులు అంతరించిపోతున్నాయి. వరాశుల్లో ఏ ఒక్కటి అధికం, ఏ ఒక్కటి తక్కువ కాదు. ఒకదానిపై ఒక్కటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి.







స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి కాలం సెలవుల దృష్ట్యా రోజుకు రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి మరింతగా పెరుగుతోంది. బుధవారం ఉదయాన్నే భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి, కోడెమొక్కు క్యూలైన్లు, ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకొని పార్వతి రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు ఎంతో ప్రీతిపాత్ర మైన కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాలు కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి హనుమాన్ భక్తులు తరలివచ్చారు.రాజన్నను దర్శించుకుని కొండగట్టు బయలుదేరారు.

● సంక్షిప్తంగా..

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యాసమితి, టెక్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో జూన్ 8న కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఎడ్యుకేషనల్ ఫెయిర్ పోస్టర్‌ను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యాసమితి సంస్థ జిల్లా ఇన్‌చార్జిలు శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

కరీంనగర్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండల పరిధిలోని పాఠశాలలకు ఎంఈవో రవీందర్ ఉచిత పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. దుర్శేడ్ జిల్లా పరిషత్ హైస్కూల్, నగునూర్ హైస్కూల్ పాఠశాలలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది గాలిపల్లి రవీందర్, రమేష్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పహెల్గాం మృతులకు అంకితం చేసే విధంగా ప్రతీ హిందువు పార్టీలకతీతంగా తరలిరావాలని కోరారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

సుభాష్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నపుడు ఉచిత విద్య ఎందుకు అందించరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టాన్ని అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నవగ్రహ జపాలు

కరీంనగర్ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణార్థం సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో ప్రధానార్చకుడు కలకుంట్ల రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో బుధవారం తొమ్మి మంది ఋత్వికులతో ఆదిత్యాది నవగ్రహ జపాలు, తర్పణాలు చేపట్టారు. డింగరి శ్రీరామాచార్యులు, వివరాంబాధ ప్రవీణ్ కుమారాచార్యులు పాల్గొన్నారు.

పండ్లు, మజ్జిగ పంపిణీ

రామడుగు, మే 21 (ఆంధ్రజ్యోతి): వెదిరలో రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాపరులకు పండ్లు, మజ్జిగ, చల్లనీరు ఉచితంగా అందజేశారు. కాలినడకన కొండగట్టు క్షేత్రం వెళ్తున్న వారి కోసం రెండు రోజులుగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంపుకొడుతున్న డ్రైనేజీలు

- సిల్ట్‌తో నిండిన వైనం
- పట్టించుకోని బల్దియా అధికారులు
- ఆందోళనలో ముంపు కాలనీల ప్రజలు



రాంనగర్ మురికి కాలువలో నిలిచిన మురికి నీరు

కరీంనగర్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రెయినేజీలు, మురికి నీటి వరద కాలువలు కంపుకొడుతున్నాయి. వర్షకాలం రాక ముందే కాలువల్లో సిల్ట్ పేరుకుపోయి అక్కడక్కడ మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఏటా వర్షాకాలం దృష్ట్యా వరద ప్రభావాన్ని తగ్గించేందుకు నగరపాకల సంస్థ ముందస్తు చర్యలు చేపడుతుంది. ముఖ్యంగా స్ట్రాం వాటర్ డ్రెయినేజీ (మురికి నీటి వరద కాలువలు)ల్లోని సిల్ట్ (మట్టి పూడిక) చెత్తచెదారాన్ని ఏప్రిల్, మేలోనే తొలగించడం ఆనవాయితీ. ఈ ఏడాది తొలగించకపోవడంతో కాలువలన్నీ సిల్ట్‌తో నిండి నీరు బయటకు ఉబికి వస్తోంది. ఈసారి వానలు ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో మురికి నీరు ఇళ్లలోకి చేరుతుందని నగరంలోని పలు ముంపు కాలనీల బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే మురికి నీటి కాలువల నుంచి నీరు రోడ్లపైకి వచ్చి చేరుతుందని, భారీ వర్షాలు పడితే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా నగరంలోని రాంనగర్, మంకమ్మతోట, జ్యోతి నగర్, ముకరాంపూర ప్రాంతాల్లో వర్షాకాలం వచ్చిందంటే ఇళ్లల్లోకి వరద నీరు చేరుతోంది. గతంలో వేసవిలో సిల్ట్ తీసినా ఇళ్లలోకి మురికి నీళ్లు ఇళ్లలోకి చేరేవని, ఈ సంవత్సరం కనీసం సిల్ట్ తీయలేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురవకముందే మురికి నీటి కాలువల్లోని సిల్ట్‌ను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

-బోనాల శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్



వర్షాలు ముంచుకొస్తున్నా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఇప్పటి వరకు సీల్టు తొలగించలేదు. పలుమార్లు మురికి నీటి కాలువల్లో సిల్ట్ తొలగించాలని కోరినా పట్టించుకోలేదు. రాంనగర్‌తోపాటు పలుకాలనీల్లో డ్రెయినేజీల్లో సిల్ట్ నిండి మురికి నీరు బయటకు వస్తోంది. వరద ముంపు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.

తహసీల్దార్లను కలిసిన జేఏసీ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్ తహసీల్దార్లుగా బాధ్యతలు చేపట్టిన నరేందర్, రాజేశ్‌ను ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కార కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాస్‌రావు జరిపిన చర్చల వివరాలను ప్రస్తావించారు. జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ రవీందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, సుమంత్‌రావు, వాస్తవిక్, కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రిన్సిపల్ జడ్జిని కలిసిన సీపీ



సమావేశంలో జడ్జి శివకుమార్, సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్.శివకుమార్‌ను బుధవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న రాజీపడే కేసులను కోర్టుల వారీగా పరిష్కరించాలని కోరారు. లోక్ అదాలత్ సన్నద్ధతలో భాగంగా కోర్టు ఆవరణలోని మీటింగ్ హాలులో సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెక్రెటరీ వెంకటేష్ ఆధ్వర్యంలో కమిషనరేట్‌లోని ఎస్‌హెచ్‌వోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డి.ప్రీతి, స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ బి.రాజేశ్వర్, ఏసీపీ వెంకటస్వామి, సీఐలు కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, ఖరీముల్లా ఖాన్, సంతోష్ కుమార్, సునీల్ కుమార్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

కరీంనగర్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు అన్నారు. అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో కొన సాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కొత్తపల్లి ఉన్నత పాఠశాలలోని పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. యూనిఫాం కుట్టు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో జనార్దన్‌రావు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతోపాటు నగరంలోని రాజీవ్‌చౌక్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రాజీవ్ చౌక్‌వద్ద రూ.15 లక్షల సుడా నిధులతో రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగరకాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ హాస్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, కోరివి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్‌డిపో క్రాస్ వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్‌బాబు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీసీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు దేశిని కోటి, పరశురామరావు, మొలుగూరి సదయ్య పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో పాల్గొన్న వొడితెల ప్రణవ్‌బాబు

నేడు మద్యం, కల్లు దుకాణాల మూసివేత

కరీంనగర్ క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో గురువారం మద్యం, కల్లు దుకాణాలను మూసివేయాలని పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాలు జారీ చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా శాంతిభద్రతల దృష్ట్యా గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 వరకు మద్యం, కల్లు అమ్మకాలపై నిషేధం విధించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, మద్యం డిపో, వైన్‌షాపులు, బార్‌లు మూసివేయలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

హనుమాన్ దీక్షాపరుల కోసం చలివేంద్రం



ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దీక్షాపరుల కోసం కొత్తపల్లిలో వీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, విద్యా ప్రదాత భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి పోస్టర్‌ను సుడా చైర్మన్, జయంతోత్సవ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘం సభ్యులు, దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రేషన్‌కార్డుల మంజూరు

కరీంనగర్ అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులను మంజూరు చేసిందని యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ 10 ఏళ్లలో కరీంనగర్ నియోజకవర్గంలో ఎన్ని కొత్త రేషన్ కార్డులు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి ఇటీవల చెప్పడం హాస్యాస్పదమన్నారు. యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్‌అమీర్, సిరిపురం మనోజ్, సద్దాం, కలీం పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో పత్రికలది కీలక పాత్ర

కరీంనగర్ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్‌జి తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో జాగృతి వారపత్రిక పాఠకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మీడియారంగం ఎంతో విస్తరించిందని, డిజిటల్, సోషల్ మీడియాతో వేగంగా సమాచార వ్యాప్తి జరిగే పరిస్థితులు వచ్చాయని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు కట్ట రాజగోపాల్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, దురిశెట్టి నిరంజనాచారి, పాక సత్యనారాయణ, ఎలగందుల సత్యనారాయణ, కిషన్‌జి, బాలరాజు, తడగొప్పుల శంకరయ్య, గీకూరి శ్రీనివాస్, మహేశ్వర్, పుల్లూరి రామారావు, మురళి, పరశురాం పాల్గొన్నారు.

మృతుడి వివరాల గుర్తింపు

కరీంనగర్ క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మనగర్ ప్రాంతం మానేరు జలాశయంలో నీటి గుంతలో లభ్యమైన మృతుడి వివరాలను పోలీసులు గుర్తించారు. మృతుడు కాగజ్‌నగర్‌లోని రాజ్‌గాంకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు శివ (35)గా గుర్తించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. శివ పద్మనగర్‌లో ఒక భవననిర్మాణం పనులు చేస్తున్నాడు. ఈ నెల 19న చేపలు పట్టేందుకు వెళ్తున్నట్లు తోటి కార్మికులకు చెప్పి బయల్దేరి తిరిగి రాలేదు. శివ కోసం వెతుకుతుండగా గుర్తు తెలియని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసుల ద్వారా తెలిసిందని మృతుడి భార్య పోలీసలుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తుగా నీటిలో పడి మృతి చెంది ఉంటాడని తెలిపింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కక్షపూరితంగా కేసీఆర్‌కు నోటీసులు

● మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌పై రాష్ట్రప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి నోటీసులు అందజేయడం సిగ్గుచేటన్నారు. మానకొండూర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్‌కు మరమ్మతు చేపట్టకుండా కేసీఆర్ కుటుంబాన్ని బదనాం చేస్తున్నారని అన్నారు. తెలంగాణను అమ్మేస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. మూడు రోజులలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని లేనియెడల రైతులతో కలిసి ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, బోడ రాజశేఖర్, రాజు ఉన్నారు.

మొగిలిపాలెంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మొగిలిపాలెంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త పి మధుకర్‌రావు మాట్లా డుతూ రైతులందరూ యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. నెల రోజుల పాటు జిల్లాలో వివిధ గ్రామాల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త డి శ్రావణి మాట్లాడుతూ అవసరం మేరకు రసాయనాలను వాడి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి అని రైతులకు సూచించారు. జిల్లా వ్యవసాయధికారిని భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పంటమార్పిడి చేస్తూ అధికదిగుబడి సాధించా లని, సాగునీరు పొదుపు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్, ఉద్యానవన అధికారి రవళి, మండల వ్యవసాయధికారి సురేందర్, ఏఈవో ప్రవీణ్, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కెడెట్లు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

హుజూరాబాద్‌రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కెడెట్ ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్ సూచించారు. మండలంలోని సింగాపూర్‌ని ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జాతీయ ఎన్‌సీసీ క్యాడెట్స్ లీడర్‌షిప్ కార్యక్రమంలో ఎన్‌సీసీ కెడెట్లకు బుధవారం ఆరోగ్యపరిరక్షణ, ఆరోగ్యకార్యక్రమాల గురించి వివరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయాను గుణంగా ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బాలికల ఎన్‌సీసీ కెడెట్లు ఆహారం తీసుకోవ డంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. అనంతరం ఎన్‌సీసీ కమాండెంట్ నుంచి హెల్త్ ఎడ్యూకేటర్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచాలి

● రాష్ట్ర పరిశీలకుడు క్రిష్ణారావు

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 20నుంచి 24వ తేది వరకు జరుగుతున్న 5 రోజుల మండలస్థాయి ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర పరిశీలకుడు క్రిష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచాలని సూచించారు. విద్యార్థి కేంద్రంగా మరిన్ని శోధనా వ్యూహాల్ని రూపొందించి అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు ముందే కరెంటు కష్టాలు

● ఆందోళనలో అన్నదాతలు

గంగాధర, మే 21 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగుకు ముందే రైతులు కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారు. గంగాధర మండలం కురిక్యాల శివారులో ట్రాన్స్‌ఫార్మర్ 30ఎస్‌పై ఉన్న రెండు మోటార్లు ఒకటి నడిపిస్తే మరోటి నడవడం లేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌పై గతంలో ఐదు మోటార్లు నడిచాయి. ప్రస్తుతం రెండు విద్యుత్ మోటార్లు నడుస్తుండగా అందులో ఒక రైతు మోటర్‌నడిస్తే మరో రైతుది నడుస్తలేదు. పరిశీలించిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్, మోటర్ల కనెక్షన్లు బాగానే ఉన్నాయని మోటర్లలోనే సమస్య ఉందని తెలిపినట్లు రైతులు వివరించారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మరో వైపు ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వేసిన విద్యుతీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ప్రతిఏటా హార్వెస్టర్‌తో వరి కోయాలంటే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ఎవరూ రావడంలేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పొలం మధ్యలో వేయడంతో ఎప్పుడైనా కాలిపోయినా, మరమ్మతులు జరపాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు మార్చాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఏడీఏను వివరణ కోరగా రైతుల సమస్య ఇప్పుడే తన దృష్టికి వచ్చిందని అధికారులను పంపించి సమస్యను పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.



కిందికి ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

విగ్రహాల ప్రతిష్ఠాపన

హుజూరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, యాగశాల ప్రవేశం, వాస్తు పూజ కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలోదేవాలయ చైర్మన్ క్యాసచక్రధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

జమ్మికుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కట్ట శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీభవన్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనకార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు: సీఐ

ఇల్లందకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని జమ్మికుంట రూరల్‌సీఐ కిషోర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు షాపులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు, వచ్చిన విత్తనాల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రొబేషనరీ ఎస్సై దిలీప్‌కుమార్ ఉన్నారు.

నూతన గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటయిన అన్ని గ్రామపంచాయతీలకు పక్కాభవనాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్ పంచాయతీ నూతన భవననిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త పంచాయతీలకు పక్కాభవనాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో సురేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే..

కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని తీగలవంతెన సమీపంలోని హజరత్ సయ్యద్‌షేర్‌అలీబాబా దర్గాను ఎమ్మెల్యే బుధవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రార్థనలు చేశారు. అనంతరం అన్యాక్రాంతానికి గురైన దర్గాభూమిని కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్రమణకు గురైన దర్గాభూమి విషయంలో సర్వేచేయించి ఆభూమి తిరిగి ఇప్పిం చేందుకు కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా దర్గాకమిటీ అధ్యక్షుడు మహమ్మద్ వాజిద్‌అలీ ఆధ్వర్యంలో కమిటీసభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దర్గాకమిటీ నిర్వాహకులు నదీముద్దీన్, ఇర్ఫాన్ మొహియుద్దీన్, అయూబ్‌ఖాన్, మీర్జా యూసుఫ్ బేగ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయండి

చొప్పదండి, మే 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌లో నిర్వహించే హిందూఏక్తా యాత్రకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లాకార్యదర్శి చేపూరి సత్యనారాయణ కోరారు. ఈమేరకు చొప్పదండిలో వారు ఏక్తాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గన్నేరువరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 19మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రఘు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని నడపాలంటే రైతులను ముంచాలా?

గంగాధర, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నడపాలంటే రైతులను ముంచాలా అని మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన గంగాధరలో మాట్లాడారు. ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికీ రైతు రుణమాఫీ జరగడం లదేన్నారు. పంటల సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు.

టెండర్లకు ఆహ్వానం

జమ్మికుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగాఉన్న స్టాల్స్‌కు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు హుజూరాబాద్ ఆర్టీసీ డిపోమేనేజర్ వి రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశక్తిగల అభ్యర్థులు టెండర్ ఫారంలను నింపి డిపో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

బీరన్న ఉత్సవాలు ప్రారంభం



ఆలయం వద్ద మహిళలు

వీణవంక, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీరన్నఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ గొల్లకురుమ కులస్తులు ఆలయానికి చేరుకునిపూజలుచేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నీలమొండయ్య, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి మంజూరు

రామడుగు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసాయిపల్లి గ్రామంలో బోరు మంజూరు చేసినందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గ్రామంలో బోరువేయగా పుష్కలంగా నీరుపడడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నియామకం

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో గల మహిళాపొదుపుసంఘం 18వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సభలో కేతిరెడ్డి ప్రేమలత అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.